సాక్షి
సంగారెడ్డి
బుధవారం । 10 । జనవరి । 2024



గాలి పటమా..

పతంగులు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వివరాలు 8లో ▸



పారదర్శకంగా పనులు

ఖేడ్ నియోజకవర్గంలో పారదర్శకంగా పనులు చేపడుతామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. వివరాలు 9లో ▸



సొంతింటి కల నెరవేరేనా?

మునిపల్లి మండల పరిధిలోని పేదలు సొంతిళ్లు లేక డబుల్ బెడ్రూంల కోసం ఎదురుచూస్తున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

పారదర్శకంగా 'ఉపాధిహామీ'



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అడిషనల్ పీడీ వామన్‌రావు

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో పారదర్శకంగా వ్యవహరించాలని డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ వామన్‌రావు తెలిపారు. మంగళవారం సిర్గాపూర్‌లో మూడో విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీలు తనిఖీ నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, క్లస్టర్ ఏపీడీ రాజు, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ సుజాత, ఏపీఓ బస్వరాజు, సర్పంచ్ జంగం స్వప్న, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

రంజోల్ గురుకుల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

జహీరాబాద్ టౌన్ : పట్టణంలోని రంజోల్‌ని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణిని సస్పెన్షన్ చేస్తూ మంగళవారం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. గురుకుల కళాశాల విద్యార్థిని స్వప్న ఈ నెల 7న హాస్టల్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. విద్యార్థినికి న్యాయం చేయాలని, బాధితులను శిక్షించాలని కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు కూడా వారికి మద్దతు తెలిపారు. విద్యార్థిని ఆత్మహత్యపై ఆర్సీఓ భీమయ్య సోమవారం గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న హాస్టల్ గదిని ఆయన పరిశీలించారు. వివరాలను సేకరించి ప్రిన్సిపాల్ కృష్ణవేణి నిర్లక్ష్యం కారణంగా ఆమె ఆత్మహత్య చేసుకుందని ఉన్నత అధికారులకు నివేదిక అందించారు. దీని ఆధారంగా ముఖ్యకార్యదర్శి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశారు. ఇలా ఉండగా ముఖ్యకార్యదర్శి ఆదేశాల మేరకు మానసిక నిపుణురాలు వరలక్ష్మి మంగళవారం గురుకులాన్ని సందర్శించారు. ఉపాధ్యాయులు, సిబ్బందికి, స్వప్నతో చాలా సన్నిహితంగా ఉండే విద్యార్థులకు ఆమె కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న తరువాత పిల్లలందరూ ఇళ్లకు వెళ్లిపోయారు.


చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఉపాధి శిక్షణ సంస్థ అందిస్తున్న ఉచిత శిక్షణను ఉపయోగించుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. మహిళలు న్యాయపరమైన సేవలను కూడా ఉచితంగా పొందవచ్చని చెప్పారు. స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ వంగ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్‌ను రద్దు చేయాలి



దీక్షలో కూర్చున్న ఉద్యోగులు, కార్మికులు

కంది(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులకు నేషనల్ పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత పద్ధతినే అమలు చేయాలని జేసీఎం సభ్యులు అజయ్ డిమాండ్ చేశారు. ఐఎన్డీడబ్ల్యూఎఫ్ పిలుపు మేరకు మంగళవారం ఎద్దుమైలారం ఆయుధ కర్మాగారం(ఓడీఎఫ్)లో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీనికి ఓడీఎఫ్ జేపీసీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జేసీఎం సభ్యులు అజయ్, గణేష్ మాట్లాడుతూ ఎన్‌పీఎస్ రద్దయ్యే వరకు ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. 2004 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన వారందరికీ ఎన్‌పీఎస్ అమలవుతోందన్నారు. ఈ విధానం రద్దు కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసినా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, మల్లికార్జున్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, అంకుశర్మ, యాదగిరి, లక్ష్మీనారాయణ, మణికృష్ణ, భాస్కర్ రావు పాల్గొన్నారు.

పల్లె పోరు జరిగేనా..!

సందిగ్ధంలో ఎన్నికల నిర్వహణ

- నెలాఖరుతో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం
- జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూపు



మునిపల్లి(అందోల్): ఇటీవల హోరాహోరీగా సాగిన అసెంబ్లీ పోరు ముగియడంతో పల్లె ఎన్నికలపై ఎన్నికల కమిషన్ దృష్టిసారించింది. జిల్లాలో 647 గ్రామ పంచాయతీలున్నాయి. ఈ నెలాఖరుతో పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ముగుస్తుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గడువులోగా ఎన్నికలు నిర్వహిస్తుందా లేదా అనే చర్చ గ్రామాల్లో జోరుగా సాగుతోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు లోక్ సభ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంపై పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఆధారపడి ఉంది. లోక్‌సభ ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలా వద్దా అనే ఆలోచనలో రాష్ట్ర సర్కారు ఉన్నట్లు తెలుస్తుంది.

అంతా అయోమయం

గతంలో ఐదేళ్లకు ఓ సారి రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు నిర్వహించేవారు. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చట్ట సవరణ చేసి స్థానిక సంస్థల రిజర్వేషన్ కాల పరిమితిని ప్రతీ ఐదు సంవత్సరాలకు సవరించాలని నిర్ణయించింది. ఒకసారి రిజర్వేషన్ ప్రకటిస్తే అదే కేటగిరి వారు రెండు సార్లు పోటీ చేసే అవకాశం ఉంటుంది. ఈ నిబంధన ప్రకారం అయితే గత ఎన్నికల సమయంలో కేటాయించిన రిజర్వేషన్లు ఈ సారి అమలు చేయాలి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు సంవత్సరాల క్రితం ఖరారు చేసిన రిజర్వేషన్లను అదే విధంగా కొనసాగిస్తుందా లేక కొత్తగా కేటాయిస్తారా అనే విషయం తేలాల్సి ఉంది. మళ్లీ రిజర్వేషన్లు ఖరారు చేయాలంటే గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో మార్పు చేయాలి. ఇందుకు చట్ట సవరణ తప్పనిసరి. ఈ ప్రక్రియ నిర్వహించాలంటే ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి.

ప్రత్యేకాధికారులకు బాధ్యతలు?

గడువులోగా ఎన్నికలు జరగకపోతే పంచాయతీ పాలన ప్రత్యేకాధికారులకు అప్పగిస్తారన్న ప్రచారం సాగుతుంది. గతంలో మూడు నుంచి నాలుగు గ్రామ పంచాయతీలకు కలిపి మండల స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. ఈ సారి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

ఎలాంటి ఆదేశాలు రాలేదు



ప్రస్తుత సర్పంచ్‌ల పదవీ కాలం ఈ నెల చివరితో ముగియనుంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. వస్తే కచ్చితంగా వెల్లడిస్తాం.
– సురేష్ మోహన్, డీపీఓ

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

ఎస్పీ రూపేష్

ఝరాసంగం(జహీరాబాద్): పోలీస్ సిబ్బంది తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ఎస్పీ రూపేష్ సూచించారు. మంగళవారం ఝరాసంగం పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్వార్టర్స్, పరిసరాలు, పీఎస్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నమోదుపై పలు సూచనలు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. పోలీసులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నేరాలను నియంత్రించాలని తెలిపారు. కార్యక్రమంలో జహీరాబాద్ డీఎస్పీ రఘు, రూరల్ సీఐ వెంకటేశ్, ఎస్‌ఐలు రాజేందర్‌రెడ్డి, క్రిష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలిస్తున్న ఎస్పీ రూపేష్, డీఎస్పీ రఘు

వైజ్ఞానిక ప్రదర్శనలతో నైపుణ్యం పెంపు

సంగారెడ్డి : పట్టణంలోని సెయింట్ ఆంథోని హైస్కూల్లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఎస్పీ చెన్నూరి రూపేష్ మంగళవారం సందర్శించారు. అక్కడ విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందుతుందని, వారిలో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికి ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుంటే కొత్త ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందన్నారు. ఆయన వెంట సంగారెడ్డి డీఎస్పీ రమేష్ కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శివలింగం, విజయ్ కృష్ణ తదితరులు ఉన్నారు.

డ్రాయింగ్ క్రాఫ్ట్ మేళా.. భళా

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక మోడల్ స్కూల్‌లో మంగళవారం డ్రాయింగ్, క్రాఫ్ట్ మేళా కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. విద్యార్థులు వేసిన పెయింటింగ్, తయారు చేసిన కళాకృతులను ప్రదర్శించారు. అత్యుత్తమమైన వాటికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ భారతీ దేవి మాట్లాడుతూ.. ఈ నెల 11న పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్లు శ్రీదేవి, సోని, దివ్య, శిరీష, కిషోర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కళాకృతులను ప్రదర్శిస్తున్న విద్యార్థిని

187 కొత్త బస్సులకు ప్రతిపాదనలు



భోజనాలు వడ్డిస్తున్న ఆర్‌ఎం ప్రభులత

నారాయణఖేడ్: మెదక్ ఆర్టీసీ రీజినల్ పరిధిలో 187 కొత్త బస్సుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు రీజినల్ మేనేజర్ ప్రభులత తెలిపారు. నారాయణఖేడ్ డిపోలో మంగళవారం కార్మికులు, అధికారులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన వనభోజనాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రీజినల్ పరిధిలో 557 బస్సులు నిత్యం 2.09 లక్షల కిలోమీటర్లు తిరుగుతుండగా.. రూ.96లక్షల ఆదాయం వస్తోందని తెలిపారు. రోజూ 1.07లక్షల మంది ప్రయాణిస్తుండగా, మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించినప్పటి నుంచి లక్షమంది ప్రయాణికులు అదనంగా పెరిగారని పేర్కొన్నారు. మహిళలు ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకుని ఒరిజినల్ కార్డుతోనే ప్రయాణించాలని సూచించారు. రీజియన్ పరిధిలో 49 ఆర్టీసీ స్థలాల్లో షట్టర్లు నిర్మించి లీజుకు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. స్థానిక డీఎం మల్లేశయ్య, పీఆర్వో పాండు, నెహ్రూనాయక్, కాశీరాం పాల్గొన్నారు.

• పాత చీర.. పంటకు రక్ష

పంటలు కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతుంటారు. ఝరాసంగం మండలం పొట్టిపల్లి గ్రామ శివారులో ఓ రైతు తన పంటను రక్షించుకునేందుకు వినూత్నంగా ఆలోచించాడు. జంతువుల బారిన పడకుండా ఆలు పంట చుట్టూ రంగురంగు చీరలను కట్టాడు. అటుగా వెళ్లేవారు రైతు ఆలోచనను మెచ్చుకుంటున్నారు.
– ఝరాసంగం(జహీరాబాద్)



కొండపోచమ్మ తల్లీ.. వసతులేవీ?

- సమస్యలు పరిష్కారమయ్యేనా..
- ఈ నెల 21 నుంచే జాతర
- నామమాత్రంగా ఏర్పాట్లు
- హామీకే పరిమితమైన యాక్షన్ ప్లాన్
- ఈసారీ భక్తులకు తప్పని తిప్పలు

ప్రసిద్ధి పొందిన ఆలయాల్లో ఒకటైన కొండపోచమ్మపై అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. ఆలయ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన యాక్షన్ ప్లాన్ హామీలకే పరిమితమైంది. ఫలితంగా ఆలయాన్ని సందర్శించే భక్తులు నానా ఇబ్బందులుపడుతున్నారు. ఈనెల 21నుంచి జాతర ప్రారంభమవుతున్న వేళ.. ఏర్పాట్లు సక్రమంగా లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గజ్వేల్/జగదేవ్‌పూర్: జిల్లాలోని కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న ప్రతి భక్తుడు కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఏటా సంక్రాంతి నుంచి ఉగాది వరకు మూడు నెలల పాటు పెద్ద ఎత్తున జాతర జరుగుతుంది. ఈ నెల 21 నుంచి జాతర ప్రారంభమై మార్చి 31వరకు కొనసాగనున్నది. లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. కానీ కనీస వసతుల కల్పనలో నిర్లక్ష్యం నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. జాతర సమయం ముంచుకొస్తుండగా, ఏర్పాట్లు మాత్రం నామమాత్రంగా సాగుతున్నాయి.



కొండపోచమ్మ ఆలయం

యాక్షన్ ప్లాన్ ఏదీ?

అప్పటి సీఎం, ప్రస్తుత గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్‌ను 2019 మే నెలలో ప్రారంభించిన సందర్భంలో ఆలయం వద్ద నవచండీయాగం నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదే సమయంలో ఆలయ అభివృద్ధికి హామీ ఇచ్చారు. రూ.10కోట్లతో యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేస్తున్నామని అధికారులు, నేతలు ప్రకటన కూడా చేశారు. ఇదే క్రమంలో అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పలుమార్లు ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి కోసం స్థపతితో ఆలయ మ్యాప్ వేయించారు. కానీ కార్యాచరణకు అడుగు పడలేదు. అలాగే చెరువు సుందరీకరణకు నోచుకోలేదు.



ఆలయం వద్ద మురికి కాల్వల దుస్థితి



సుందరీకరణకు నోచుకోని ఆలయ సమీపంలోని చెరువు

ఉత్సవ కమిటీ ఏర్పడేనా?

ఐదేళ్లుగా కొండపోచమ్మకు రెగ్యులర్ పాలకవర్గం ఏర్పాటు చేయడం లేదు. జాతరకు ముందు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తూ మూడు నెలల పాటు పాలకవర్గం పనిచేసేలా తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ప్రభుత్వం మారడం, జాతర సమయం దగ్గరకు వస్తున్నప్పటికీ కమిటీని ఏర్పాటు చేస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్సవ కమిటీ ఏర్పాటుకు కొంతమంది కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇదిలావుంటే జాతర ఏర్పాట్లపై ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, తాగునీరు, ఇతర కనీస వసతుల కల్పనపై దృష్టి సారిస్తామన్నారు.

వేధిస్తున్న పార్కింగ్ సమస్య..

జాతర సమయంలో కొండపోచమ్మ ఆలయ ప్రాంగణానికి వేల సంఖ్యలో వాహనాలు వస్తుంటాయి. కానీ పార్కింగ్‌కు స్థలం లేకపోవడం వల్ల రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. ప్రభుత్వానికి, గుడికి సంబంధించిన భూమి లేకపోవడంతో పార్కింగ్‌సమస్య జటిలమవుతోంది. దీంతో ప్రైవేటు స్థలాల్లో వాహనాలు నిలిపితే అందిన కాడికి డబ్బులు వసూలు చేస్తున్నారు. రోడ్డు వెడల్పు అయినా పార్కింగ్‌సమస్య మాత్రం అలాగే ఉంది. రోడ్డుపై వాహనాలు నిలపడం వల్ల బోనాలతో వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. కొండపోచమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య కూడా వేధిస్తోంది. ఆలయం వద్ద నిర్మించిన కాల్వల్లో ఎక్కడికక్కడా మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. వ్యర్థ పదార్థాలు మురికి కాల్వలోనే పడేస్తున్నారు. దీనివల్ల పక్కనే ఉన్న కెనాల్ సైతం దుర్గంధభరితంగా మారింది. ఆలయం వద్ద జాతర ఏర్పాట్లు నామమాత్రంగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఆలయం వద్ద గదులకు, ఆలయానికి రంగులు వేసే పనులు మాత్రమే ప్రారంభించారు. భక్తులకు కావాల్సిన తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల సౌకర్యం లాంటి పనుల ఊసేలేదు.

కేవీఆర్ నియామకం వ్యూహమేనా?

జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని దక్కించుకునేందుకు బీజేపీ కసరత్తు

జహీరాబాద్: పార్లమెంట్ ఎన్నికలపై బీజేపీ దృష్టి సారించింది. అందులో భాగంగానే జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డిని ఇన్‌చార్జిగా నియమించింది. ఆయన నియామకం వ్యూహాత్మకంలోనే భాగంగా జరిగిందనే అభిప్రాయాన్ని బీజేపీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోనే ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్దండులైన కేసీఆర్, రేవంత్‌రెడ్డిలను ఓడించి ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంకటరమణారెడ్డి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. జహీరాబాద్ లోక్‌సభ స్థానాన్ని గెలిపించుకునేందుకు వెంకటరమణారెడ్డిని ఇన్‌చార్జిగా నియమించడం ద్వారా ప్రజల దృష్టిని ఆకర్షించడమే కాకుండా.. పార్టీ కేడర్‌ను ఏకతాటిపైకి తీసుకురావచ్చని కమలం పార్టీ అగ్రనేతలు భావించారు. అంతేకాకుండా జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో కామారెడ్డి జిల్లాకు చెందిన కామారెడ్డి, ఎల్లారెడ్డి, భాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ స్థానాలు ఉండడం కూడా ఆయన నియామకానికి మరో కారణంగా చెప్పుకుంటున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల కంటే బీజేపీ టికెట్ కోసమే అధికంగా పోటీ నెలకొని ఉంది. ఇప్పటికే డజను మంది వరకు పోటీ పడుతున్నారు.



కె.వెంకట రమణారెడ్డి

బైక్ మెకానిక్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్ : గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పల్లె ప్రాంత పురుషులకు ఫిబ్రవరి 1 నుంచి నెల రోజులపాటు బైక్ మెకానిక్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ కేంద్రం డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉండి.. 18 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులని చెప్పారు. ట్రైనింగ్‌లో ఉచిత భోజన, వసతి కల్పిస్తారన్నారు. వివరాలకు 9490129839, 9490129839 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గంజాయి పట్టివేత.. నలుగురి రిమాండ్

సంగారెడ్డి అర్బన్ : గంజాయి అమ్ముతున్న ముఠాను అరెస్టు చేసినట్లు సంగారెడ్డి డీఎస్పీ రమేశ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పుల్కల్ మండలం మినుపూర్ తండాకు చెందిన జెరుపుల శీను(46), పటాన్ చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన వడ్డే అశోక్ (38)లు గంజాయితో సంగారెడ్డి వైపు వస్తున్నారనే సమాచారం పోలీసులకు తెలిసింది. ఈ నెల 8న సాయంత్రం సీఐ శ్రీధర్‌రెడ్డి సిబ్బందితో కలిసి కింది బజార్ సమీపంలో బైక్ పై వస్తున్న వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పోలీసులు విచారించగా మరికొన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. మిన్పూర్ తండాకు చెందిన రామావత్ అనిల్, జహీరాబాద్ మండలం మల్చల్మ తండాకు చెందిన బానోత్ శీను, నాగల్ గిద్ద మండలం మైనపల్లి తండాకు చెందిన రాథోడ్ రవీందర్, గైరాం తండాకు చెందిన రాథోడ్ హరి, కర్ణాటక రాష్ట్రానికి చెందిన మోహన్, మిన్పూర్ కు చెందిన నర్సింలు ఒక ముఠాగా ఏర్పడి మోహన్ అనే వ్యక్తి ద్వారా ఒరిస్సా, భద్రాచలం బోర్డర్ నుంచి గంజాయిని తీసుకువస్తున్నట్లు తెలిపారు. దానిని ఇస్నాపూర్, జహీరాబాద్, సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లోని కంపెనీల్లో పని చేసే వ్యక్తులకు అమ్ముతున్నట్లు నేరం ఒప్పుకున్నారు. ఈ ముఠాలో నలుగురు నేరస్తుల నుంచి రెండు బైక్‌లు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని.. వారిని జిల్లా కోర్టులో హాజరు పరిచారు. నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించగా సంగారెడ్డి జైలుకి తరలించారు. పరారీలో ఉన్న మరో నలుగురి కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.



గంజాయి ప్యాకెట్లు చూపిస్తున్న డీఎస్పీ రమేశ్ కుమార్

క్లుప్తంగా

పొన్నం ప్రభాకర్‌వి బాధ్యతలేని మాటలు

మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



సతీశ్‌కుమార్

హుస్నాబాద్: పొన్నం ప్రభాకర్ బాధ్యత గల మంత్రి పదవిలో ఉండి పూర్తిగా తెలుసుకొని మాట్లాడాలని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ తన అన్న కూతురు సరితారావు అనే యువతికి జెన్‌కోలో ఏఈ ఉద్యోగం ఇప్పించారని తప్పుడు ఆరోపణలు చేయడం మంత్రికి తగదన్నారు. వినోద్ కుమార్‌కు అన్న లేడని, ఇంటి పేరు ఉంటే బంధువు అయినట్టేనా అని ప్రశ్నించారు. రాజకీయ దురుద్దేశ్యంతో ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. మంత్రి అనే బాధ్యత లేకుండా మాట్లాడటం భావ్యం కాదన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి: ముగ్గురిపై కేసు

జోగిపేట(అందోల్): సంగారెడ్డి వైపు నుంచి జోగిపేటకు వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై అందోలు మండలం డాకూరు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటన మంగళవారం జరిగింది. ఎస్‌ఐ అరుణ్‌కుమార్ కథనం ప్రకారం.. స్థానిక ఫైర్ స్టేషన్ వద్ద ఉన్న మూల మలుపు నుంచి ఒక బైకు బస్ ముందుకు దూసుకువచ్చింది. దీంతో బస్సు డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేయగా బైక్‌కు తగిలి వాళ్లు పడిపోయారు. దీంతో వారు డ్రైవర్ రమేశ్‌పై దాడి చేశారు. డ్రైవర్ జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సంజీవులు, ఎలుక చంద్రయ్య, ప్రకాశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గురుకుల విద్యార్థిని మృతిపై విచారణ జరపాలి

జహీరాబాద్ టౌన్: రంజోల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో ఇంటర్ చదువుతున్న స్వప్న మృతిపై సమగ్ర విచారణ జరపాలని సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు కరణం రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులు మృతి చెందినప్పుడు ప్రిన్సిపాళ్లను సస్పెండ్‌చేసి ఉన్నత అధికారులు చేతులు దులుపుకుంటున్నారని వాపోయారు. జిల్లాలో ఇప్పటి వరకు వివిధ గురుకులాల్లో ఐదుగురు చనిపోయారన్నారు. గురుకులాల్లో మరణాలను అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకొవడంలేదన్నారు. స్వప్న మృతిపై ఉన్నత అధికారులతో సమగ్ర విచారాణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు

వర్గల్(గజ్వేల్): మద్యం సేవించి బైక్ నడిపిన ఒక వ్యక్తికి న్యాయమూర్తి ప్రియాంక రెండు రోజుల జైలుశిక్ష విధించారు. వర్గల్ మండలం గౌరారం ఎస్‌ఐ విజయభాస్కర్ మంగళవారం వివరాలు తెలిపారు. మర్కూక్ మండలం పాములపర్తికి చెందిన తాడం నర్సింగరావు మద్యం సేవించి బైక్ నడుపుతుండగా పట్టుకున్నామని, బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ అనంతరం డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. న్యాయమూర్తి అతనికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని, అలాంటి వారిపై చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

బాలలతో పనిచేయిస్తే కఠిన చర్యలు

అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాములు

పటాన్‌చెరు టౌన్: చిన్నారులతో పని చేయిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గొల్లపల్లి రాములు హెచ్చరించారు. మంగళవారం అమీన్‌పూర్ పరిధిలో ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించారు. బీరంగూడ నుండి కిష్టారెడ్డిపేటకు వెళ్లే దారిలో ఎస్‌ఆర్ వీల్స్ షాప్‌లో ఇద్దరు బాల కార్మికులు పనిచేయడాన్ని గుర్తించారు. పిల్లలతో పనిచేయిస్తున్న యజమాని రాజశేఖర్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గాలిపటమా.. పద పద..

- పతంగుల వెంట పిల్లల పరుగులు
- నరదామాటున ప్రమాదాలు
- రెండేళ్ల క్రితం విద్యుత్ షాక్
- ముగ్గురు చిన్నారులకు గాయాలు

జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సందడి ప్రారంభమైంది. సంక్రాంతి అంటే మొదట గుర్తొచ్చేది పతంగులు, వాటి వెంట పరుగులుతీసే పిల్లలు. గాలిపటాల కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తారు. వారి కోసం ఇప్పటికే మార్కెట్‌లో గాలిపటాల దుకాణాలు అప్పుడే వెలిశాయి.



విక్రయానికి సిద్ధంగా ఉన్న పతంగులు, సామగ్రి..

నారాయణఖేడ్: పతంగులకు సంబంధించిన సామగ్రి అమ్మకాలు జరుగుతున్నాయి. దీంతో పిల్లలు, పెద్దలు ఉదయం, సాయంత్రం, సెలవుది నాల్లో పతంగులు ఎగురవేస్తూ సందడి చేస్తున్నారు. దుకాణాల్లో పతంగులు, మాంజా, దారాలు, క్యాండిల్స్, ప్యారాషూట్, ఫ్యాన్సీ ఐటెంలు, ఛరఖా, ట్రెడ్ చెరఖా, చిన్నపిల్ల ఫ్యాన్సీ ఐటెంలు విక్రయానికి సిద్ధం చేశారు.

పొంచిఉన్న ప్రమాదాలు..

ఏటా సంక్రాంతి పండగ సందర్భంగా ఎగురవేసే గాలిపటాల కారణంగా ఎక్కడో ఓ చోట విషాద ఘటనలు జరుగుతూనేఉన్నాయి. పండగ ఆహ్లాదకర వాతావరణంలో అందరూ కలసి సంతోషంగా జరుపుకోవాల్సి ఉండగా తెలిసీ తెలియని వయస్సులో చిన్న పిల్లలు ప్రమాదాల భారిన పడుతున్నారు. రెండేళ్ళ క్రితం నారాయణఖేడ్ పట్టణంలోని దత్తాత్రేయ కాలనీలో ఓ డాబాపై ముగ్గురు బాలలు పతంగులు ఎగురవేస్తూ ప్రమాదానికి గురయ్యారు. డాబా సమీపంగా ఉన్న 11కేవీ వైర్లకు ఇరుక్కొన్న గాలిపటాన్ని తీసే క్రమంలో 8 ఏళ్ళలోపు ముగ్గురు చిన్నారులు తీవ్ర గాయాల పాలయ్యారు. విద్యుదాఘాతంతో శరీరమంతా కాలిపోయింది. ఇలాంటిం ప్రమాదకర ఘటనలు జిల్లా వ్యాపితంగా ఎక్కడో ఓ చోట వెలుగు చూస్తూనే ఉంటున్నాయి.

అప్రమత్తత అవసరం..



పట్టణాల్లో మైదాన ప్రాంతాలు లేకపోవడంతో బహుళ అంతస్తుల భవనం పైకప్పుల నుంచి పతంగులను ఎగురవేస్తారు. పిట్ట గోడలు లేని పైకప్పుల అంచుల వద్ద పతంగులు ఎగురవేసే క్రమంలో అపాయాలు పొంచి ఉంటాయి. గాలి పటాలు విద్యుత్ లైన్లపై పడిన సందర్భాల్లో వాటిని దక్కించుకునే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. దీనికి తోడు చైనా మాంజాలు కూడా ప్రమాదాలకు హేతువుగా మారాయి. చైనా మాంజాల కారణంగా చేతులు తెగడం, పక్షులు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. గాలిపటాలు ఎగురవేసేందుకు చైనా మాంజా సౌకర్యంగా ఉంటుంది. పోటాపోటీగా ఆకాశంలో ఎగురుతున్న పతంగిని కోసేందుకు చైనా మాంజాతోనే సాధ్యపడుతుంది. నైలాన్, సింథటిక్ దారానికి గాజు పొడి, కొన్ని రసాయనాలను కలిపి తయారు చేయడంతో మాంజా దారం తెగకుండా దృఢంగా ఉండడంతో ప్రమాదాలు కారణం అవుతున్నాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి

- భవనాలు, గోడలు, బాల్కానీలపై నుంచి గాలిపటాలు ఎగురవేయవద్దు. గాలి వీచిన దిక్కు పతంగి ఎగురుతుంది. దానిపైనే శ్రద్ధ పెట్టి నడిస్తే పడిపోయే ప్రమాదం ఉంది.
- చిన్న చిన్న గల్లీలు, భారీ భవన సముదాయాలు, విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్ల సమీపంలో గాలిపటాలు ఎగురవేసే సాహసం చేయకూడదు. పతంగులు విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్లపై పడితే తీసుకునే ప్రయత్నం చేయొద్దు. ఇలా తీసుకునే ప్రయత్నంలో ప్రమాదాలకు గురవుతున్నారు.
- రోడ్ల వెంట గాలిపటాలు ఎగురవేయొద్దు. గాలిలో ఎగురుతున్న పతంగిని చూసుకుంటూ వాహనాలు గమనించకుండా వ్యవహరిస్తే ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంది.
- పతంగి ఎగురవేసేందుకు వినియోగించే నిషేధిత మాంజా ప్రమాదకరంగా మారుతోంది. ఎగురవేసే వారి చేతి వేళ్లు తెగుతున్నాయి. పైగా రహదారులపై వెళ్తున్న వారి మెడకు బిగుసుకుపోవడంతో గొంతు దగ్గర గాయాలవుతున్నాయి.
- పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తుంటే తల్లిదండ్రులు పర్యవేక్షించాలి. డాబాలపై కాకుండా మైదానాలను ఎంపిక చేసుకోవాలి.
- దారం వల్ల చేతులు సురక్షితంగా ఉండాలంటే గ్లౌజ్‌లు వేసుకోవాలి.
- పెద్ద పెద్ద ఫ్యాన్సీ గాలిపటాలకు బదులు చిన్న చిన్న పతంగులను ఎగురవేయాలి.

వ్యాపారం ఇంకా పుంజుకోలేదు



ఇప్పుడిప్పుడే పతంగుల కొనుగోళ్లు ప్రారంభమైయ్యాయి. పండకు నాలుగైదు రోజులు ముందు అమ్మకాలు అధికంగా ఉంటాయి. నిషేధం ఉండడంతో చైనా మాంజాలు అమ్మడంలేదు. కేవలం సాధారణ కాటన్ మాంజాలు, దారాలే విక్రయిస్తున్నాం. రూ.5 నుంచి రూ.1వేయి విలువగల పతంగుల వరకు ఉన్నాయి. దూల్‌పేట్ నుంచి పతంగులను తెచ్చి గ్రామాల్లోని దుకాణాదారులకు, చిల్లర వినియోగదారులకు విక్రయిస్తాం.

– దుర్గాప్రసాద్, పతంగుల వ్యాపారి, నారాయణఖేడ్

చైనా మాంజాలు అమ్మితే చర్యలు



ప్రమాదకర మాంజా వాడినా, సరఫరా చేసినా, నిల్వ ఉంచినా వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేస్తాం. పక్షులకు ప్రమాదం అని ప్రభుత్వం సింథటిక్ చైనా మాంజాలను నిషేధించింది. అమ్మకాలు చేపడితే దాడులు చేసి స్వాధీనం చేసుకోవడమే కాకుండా కేసులు నమోదు చేస్తాం. పక్షిజాతికి మన సరదా నష్టం కలిగించకూడదు.

– శ్రీధర్‌రావు, జిల్లా అటవీశాఖ అధికారి, సంగారెడ్డి

ఎఫ్‌ఎల్‌ఎన్, ఉన్నతిని రద్దు చేయాలి

పీఆర్టీయూటీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

కోహెడ(హుస్నాబాద్): ఎఫ్‌ఎల్‌ఎన్, ఉన్నతి ప్రోగ్రాంలను రద్దు చేయాలని పీఆర్టీయూటీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఫ్‌ఎల్‌ఎన్, ఉన్నతి ప్రోగ్రాంల వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురౌతున్నారని, విద్యాబోధనకు ఆటంకం కలుగుతుందని వాపోయారు. వాటి రద్దుకు పీఆర్టీయూటీ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నారాయణ, ఓదెలు, మహేందర్‌రెడ్డి, భాస్కర్, పద్మ, మహమూద్, కృష్ణారెడ్డి, లింగారెడ్డి, రాజు, విజయలక్ష్మి, అనిత, స్వప్న, రామకృష్ణ, లక్ష్మి, సంపత్, మనోహర్, సద్గుణాచారి, శ్రీనివాస్, రాజయ్య, రమేశ్ సధానందం పాల్గొన్నారు.

పార్ట్ టైం జాబ్ అంటూ మోసం

శివ్వంపేట(నర్సాపూర్): పార్ట్ టైం జాబ్ అంటూ ఆన్‌లైన్‌లో మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. మండల పరిధి దొంతి గ్రామానికి చెందిన గోత్రాల లక్ష్మీనర్సయ్యకు పార్ట్ టైం జాబ్ అంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. ఇంట్లోనే పెన్నులు, పెన్సిల్స్ ప్యాక్ చేస్తూ ఆదాయం పొందేందుకు అవకాశం కల్పిస్తామని నమ్మించారు. ఉద్యోగంలో జాయిన్ కావడానికి ముందుగా రూ.650 గూగుల్‌పే చేయాలని చెప్పడంతో అలానే చేశాడు. ఐటీ కార్డు కోసం మరో రూ.2 వేలు, మెటీరియల్ కోసం మరో 4 వేలు రూపాయలు విడతల వారీగా బాధితుడు గూగుల్ పే చేశాడు. వారం రోజులకు మరో రూ.5 వేలు పేమెంట్ చేయాలని సైబర్ నేరగాళ్లు చెప్పడంతో అనుమానం వచ్చి మోసపోయానని తెలుసుకొని డబ్బులు వాపస్ ఇవ్వాలని లక్ష్మీనర్సయ్య కోరడంతో అప్పటి నుండి సైబర్ నేరగాళ్లు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని బాధితుడు వాపోయాడు.

శాస్త్రీయ విజ్ఞానం పెంచడానికే 'చెకుముకి'

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చెకుముకి సైన్స్ సంబురాల పోస్టర్‌ను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించడం కోసం జన విజ్ఞాన వేదిక నిర్విరామ కృషి చేస్తోందని చెప్పారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సైన్సు సంబరాలు 2023–24 ను నాలుగు స్థాయిలలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు, జిల్లా అధ్యక్షుడు ములుగు బాలరాజు మాట్లాడుతూ జనవరి 19న పాఠశాల స్థాయి, జనవరి 27న మండల స్థాయి, ఫిబ్రవరి 3న జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ రామస్వామి, హెచ్‌ఎం రామచంద్రం, జన విజ్ఞాన వేదిక నాయకులు తుమ్మ సత్యం, సాదత్ అలీ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

తూప్రాన్: సెల్‌ఫోన్ పేలడంతో గాయపడి చికిత్స పొందుతున్న కార్మికుడు మృతి చెందినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్ర రాష్ట్రం బండార్ జిల్లా తూంసర్ తాలుకా ఆలేసు గ్రామానికి చెందిన సునిల్ మహాదేవ్ కండాలే(30) తూప్రాన్ మండలం ఘనపూర్ వలసవచ్చాడు. శివంశంకరం క్రషర్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం తోటి కార్మికులతో కలిసి కూరగాయలు తెచ్చుకోవడానికి వెళ్తుండగా సునీల్ జేబులో సెల్‌ఫోన్‌ను పేలింది. దీంతో అతడిని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొత్త బట్టలు కొనలేదని.. తండ్రి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: కొత్త బట్టలు కొనివ్వాలని తండ్రి, కొడుకుల మధ్య జరిగిన గొడవలో మనస్తాపం చెందిన తండ్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమణ కథనం ప్రకారం.. చిత్తూరు జిల్లా సాకిరేవుపల్లికి చెందిన రమణయ్య(65), తన కుమారుడు మహేశ్ బతుకుదెరువు కోసం ఆరు నెలల క్రితం హైదరాబాద్ వచ్చి, మూడు నెల క్రితం అమీన్‌పూర్ వద్ద ఒక ఆఫీస్ వాచ్‌మెన్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కొత్త బట్టలు కొని ఇవ్వాలని రమణయ్య తన కుమారుడు మహేశ్‌ను అడిగాడు. యాజమాని వేతనం ఇవ్వలేదని చెప్పడంతో వారి మధ్య గొడవ జరిగింది. అనంతరం మహేశ్ స్నానం కోసం వెళ్ళగా.. తండ్రి రమణయ్య బయటకు వచ్చి ఆఫీసుకు సంబంధించిన కమాన్‌కు నైలాన్ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించి మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంబీబీఎస్ చదువుకు రూ.6.50లక్షలు సాయం

ముందుకు వచ్చిన వ్యాపారవేత్త

జహీరాబాద్: మండలంలోని హుగ్గెల్లి గ్రామానికి చెందిన బొడ్డు జగన్మోహన్ ఎంబీబీఎస్ చదువుకు రూ.6.50 లక్షలు ఆర్థిక సాయం చేసేందుకు ఒక వ్యాపార వేత్త ముందుకు వచ్చినట్లు బూచనెల్లి సర్పంచ్ తనయుడు, కాంగ్రెస్ నాయకుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విద్యార్థి జగన్మోహన్ వ్యాపారవేత్త వినోద్‌కుమార్‌ను తన కుటుంబ సభ్యులతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పేద కుటుంబం కావడంతో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుకునేందుకు ఫీజు కట్టలేని పరిస్థితిలో ఉండడంతో వెంకట్‌రెడ్డిని ఆశ్రయించాడు. దీంతో వెంకట్‌రెడ్డి తన క్లాస్‌మెట్ వినోద్‌కుమార్‌ను సంప్రదించి విషయాన్ని తెలిపారు. అందుకు సమ్మతించి ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. మొదటి విడత ఫీజు కింద రూ.1.70 లక్షలు విద్యార్థికి అందజేశారు. వ్యాపారవేత్త వినోద్‌కుమార్‌కు, కాంగ్రెస్ నాయకుడు వెంకట్‌రెడ్డికి విద్యార్థి జగన్మోహన్ తల్లి దండ్రులు కతజ్ఞతలు తెలిపారు.



వినోద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న జగన్మోహన్ కుటుంబ సభ్యులు

ఎంపీపీపై అట్రాసిటీ కేసు

మద్దూరు(హుస్నాబాద్): మద్దూర్ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మద్దూరు ఎస్‌ఐ యూనుస్ అహ్మద్‌అలీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దళితబంధు స్కీమ్ డబ్బులు ఇప్పిస్తానని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన ముత్యాల కిషన్, చిలుక ప్రశాంత్ దగ్గర ఎంపీపీ లక్ష రూపాయాలు తీసుకున్నారు. సమయం గడిచినా దళితబంధు డబ్బులు ఇప్పించకపోవడంతో బాధితులు ఆయనను అడిగితే కృష్ణారెడ్డి బెదిరించారు. దీంతో వారు అతడిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గ్యాస్ సిలిండర్, బైక్‌ల దొంగ అరెస్ట్

మెదక్ మున్సిపాలిటీ: గ్యాస్ సిలిండర్‌తోపాటు బైక్‌లను దొంగతనం చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు సీఐ వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సోమవారం తన సిబ్బందితో బోధన్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా మామిడి శ్రీకాంత్ అనే వ్యక్తి ఒక బైకుపై గ్యాస్ సిలిండర్ తీసుకొని వెళ్తున్నాడు. అనుమానస్పదంగా కనిపించడంతో విచారించగా తాను మెదక్‌లోని చంద్ర భవన్ వెంచర్‌లో సిలిండర్‌ను, దుర్గ కాలనీలో బైకును దొంగిలించినట్టు చెప్పాడు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ పాత నేరస్తుడని, గత నవంబర్, డిసెంబర్ నెలల్లో రామాయంపేట, చేగుంట, తూప్రాన్‌లో అతను బైకు దొంగతనాలు చేసినట్టు ఒప్పుకున్నాడని తెలిపారు. అతని వద్ద నుంచి 4 బైకులు, 26 సిలిండర్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.



పోలీసులు అదుపులో సిలిండర్లు, బైక్‌ల దొంగ శ్రీకాంత్

ఆకులు రాల్చినా అందమే..

"చెట్టునైనా.. కాకపోతిని ఏటికో వసంతం దక్కేది.." అంటూ ఓ కవి చెప్పిన మాటలు గుర్తొస్తాయి ఆకులు రాలిన చెట్లను చూస్తే. అవి రాల్చినా.. వసంతంలో మళ్లీ చిగురిస్తాయి. మనందరికీ ప్రేరణనిస్తాయి. అందంగా కను విందుచేస్తాయి. ఆనందాన్నిస్తాయి. సిద్దిపేట-హైదరాబాద్ ప్రధాన రహదారి డివైడర్లపై ఉన్న ఆకులు రాలిన వృక్షాలు అందరినీ అలరిస్తున్నాయి.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



అనుమానాస్పద మృతి

చౌటుప్పల్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన బూడిదపాటి ప్రవీణ్‌కుమార్(24) తన తల్లిదండ్రులతో కలిసి చౌటుప్పల్‌లోని మల్లికార్జున స్కూల్ దగ్గరలోని ఓ ఇంట్లో నివసిస్తున్నాడు. ప్రవీణ్ లింగోజిగూడెం గ్రామంలోని ఓ పరిశ్రమలో హెల్పర్‌గాను, అతడి తల్లిదండ్రులు వేరే పరిశ్రమలో కూలీలుగాను పని చేస్తున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు మంగళవారం పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ప్రవీణ్‌కుమార్ ఉరేసుకుని ఉండడం గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎల్లమ్మ తల్లి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. మంగళవారం ఏఎస్‌ఐ మిస్బావుద్దీన్ వివరాలు తెలిపారు. ఆలయ పూజారి తాళం పగులగొట్టి ఉండడాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీ కూడా పగలగొట్టి ఉందని, ఇత్తడి జమదగ్ని, ఎల్లమ్మ విగ్రహాలు, గంట, అమ్మవారి వెండి కన్నులు దొంగలించారని ఏఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు నీటమునిగి..

శివ్వంపేట(నర్సాపూర్): ప్రమాదవశాస్తూ నీటమునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధి బోజ్యా తండాలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, ఎస్‌ఐ రవికాంత్‌రావు వివరాల ప్రకారం.. తండాకు చెందిన గుగ్లోత్ రాములు(65) సోమవారం ఉదయం చండి గ్రామానికి వెళ్లి పెన్షన్ డబ్బులు తీసుకొస్తానని ఇంట్లో నుండి వెళ్లాడు. రాత్రి వరకు రావకపోవడంతో కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాల్లో వెతికారు. మంగళవారం తండా సమీపంలో ఉన్న లోతన్ చెరువు కట్టపై రాములుకు సంబంధించి వస్తువులు కనిపించడంతో చెరువులో వెతకగా రాములు మృతదేహం లభించింది. మృతుడు కొడుకు పూల్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.



రాములు మృతదేహం

స్నేహితుడికి వీడ్కోలు చెప్పి.. విగతజీవిగా

- కల్వర్టుకు ఢీకొని కారు ప్రమాదం
- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

బెజ్జంకి(సిద్దిపేట): కారు కల్వర్టును ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ శివారులో గల రాజీవ్ రహదారిపై మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇస్లాంపూర్‌కు చెందిన మహమ్మద్ అస్లాం, సోహెల్, పాషా ముగ్గురూ దుబాయి వెళ్తున్న తమ స్నేహితుడిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దించి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో బెజ్జంకి క్రాసింగ్ శివారులో కారు కల్వర్టును ఢీకొని అదుపు తప్పి కాలువలో పడిపోయింది. దీంతో మహ్మద్ అస్లాం(29) అక్కడికక్కడే మృతి చెందగా సోహెల్, పాషా తీవ్రంగా గాయపడ్డారు. వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు పాన్ షాప్ నడుపుకుంటు జీవిస్తున్నాడు. అతనికి భార్య, ఒక బాబు ఉన్నారు. అస్లాం సోదరుడు మోయిజ్ ఫర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ శంకరరావు తెలిపారు.



క్రేన్ సహాయంతో బయటకు తీస్తున్న కారు



కారులో మహ్మద్ అస్లాం మృతదేహం

పట్టాలకు పొజిషన్ ఎప్పుడు?

- పట్టాలు అందజేసిన మంత్రి, కలెక్టర్
- అన్యాక్రాంతం అవుతున్న భూములు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా విధులు నిర్వహిస్తున్న గ్రామీణ విలేకరులకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలకు పొజిషన్ చూపించడంలో రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. 6 నెలల క్రితం పట్టాలు ఇచ్చినా నేటికీ పొజిషన్ చూపించలేదు. మండల పరిధిలోని గుండ్లపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిలో సెకండ్ సీరియల్ 19లో పట్టాలిచ్చారు. ఈ సర్వేనంబర్‌లో 65 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా 49 మంది రైతులకు 63 ఎకరాలు 2005లో అసైన్డ్ చేశారు. అందులో 12 మంది రైతులు 2011లో 7 ఎకరాలు 13 గుంటలు వెంచర్ ఏర్పాటు కోసం హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మినట్లు తెలుసుకొని 2012లో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అందులోనే కొంత భూమిని విలేకరుల ఇళ్ల స్థలాల కోసం రెవెన్యూ సిబ్బంది కొంత భూమి ఎంపిక చేశారు. అక్రిడిటేషన్ కార్డులు కలిగిన 13 మందికి 6 నెలల క్రితం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టా సర్టిఫికెట్లు అందజేసింది. అప్పటి మంత్రి హరీశ్‌రావు, మహిళా కమిషన్ చైర్ పర్సన్, ప్రస్తుత ఎమ్మెల్యే సునీతారెడ్డి, అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా ఆ పట్టాలు అందజేశారు. ఈ పట్టా భూముల్లో పొజిషన్ కోసం విలేకరులు చదును చేసి హద్దులు ఏర్పాటు చేశారు. గతంలో ఆ భూమిని తాము సాగు చేశామంటూ పలువురు రైతులు వాటిని తొలగించారు. ఈ విషయంపై పలుమార్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి విన్నవించినా పట్టించుకోలేదని విలేకరులు వాపోయారు.



విలేకరులకు కేటాయించిన స్థలం

హద్దులు ఏర్పాటు చేయిస్తా



విలేకరులకు కేటాయించిన స్థలంలో పొజిషన్ చూపించి హద్దులు ఏర్పాటు చేయిస్తాను. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకునేలా ఉన్నతధికారులకు నివేదిస్తా.

– సునీతారెడ్డి, ఎమ్మెల్యే